క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మొక్కలను తొలగిస్తున్న ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి

పెండ్లిమర్రి : గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పెండ్లిమర్రిలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం అవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.

నేడు పెండింగ్ ప్రాజెక్టులపై పర్యటన

చింతకొమ్మదిన్నె : ఏపీ రైతు సంఘం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26న పెండింగ్ ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవికతను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని, దశాబ్దాల తరబడి రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. సీకే దిన్నె మండలం గాలేరు నగరిలో అంతర్భాగంగా ఉన్న గుర్రంగుంపు స్టాక్ పాయింట్ ను క్షేత్రస్థాయి పర్యటన కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. రైతు సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

హైస్కూళ్లను ప్లస్ గానే కొనసాగించాలి

వేంపల్లె : రాష్ట్రంలోని 294 హైస్కూళ్లను యథావిధిగా ప్లస్ పాఠశాలలుగానే కొనసాగించాలని, అందుకోసం కృషి చేయాలని పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తిని పీజీటీ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ చెరుకూరు శ్రీనివాసులు విన్నవించారు. ఎమ్మెల్సీని కలిసి ఆయా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ విషయంపై సానుకూలంగా ఉన్నామని, సంబంధిత ఫైల్‌ని ఎడ్యుకేషన్ సెక్రటరీ పెట్టినట్లు తెలిపారు. అలాగే శాసన మండలి సమావేశాల్లో కూడా ఈ అంశాలపై ప్రస్తావిస్తామన్నారు. వీటితోపాటు ఆయా ప్రతిపాదనలు, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

నేడు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

వీరపునాయునిపల్లె : మండలంలోని 22 పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శేషాచలపతి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఏవరైనా తీసుకుపోండి



బందల దొడ్డిలో ఉన్న గుర్రాలు

జమ్మలమడుగు : గుర్రాలను మేపడం కష్టం అవుతుంది. గుర్రాల యజమానులు ఎవరైనా ఉంటే వాటిని తీసుకుపోడంటూ కన్నెలూరు గ్రామ పెద్దలు వాపోతున్నారు. గ్రామంలో రైతులు వేసిన పంట పొలాల్లో దాదాపు ఐదు గుర్రాలు పోలాల్లో పడి పంటను తీనడంతో స్థానిక కావలివాళ్లు వాటిని బంధించి గ్రామానికి సంబంధించిన బందలదొడ్డిలో వేసేశారు. దాదాపు పదిరోజుల పైనుంచి బందల దొడ్డిలో ఉన్న గుర్రాలకు మేత వేస్తున్నారు. గుర్రాల యజమానులు ఎవరైనా ఉంటే వచ్చి వాటిని తీసుకుపోండి. లేదా గుర్రాలను పెంచడం ఆసక్తిగా ఉన్నవారు ఎవరైనా ముందుకు వచ్చి వాటిని తీసుకుపోతే ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

అన్నదానం

వేంపల్లె : అనాథలను ఆదుకోవడం మన కనీస బాధ్యతని వేంపల్లి వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దుంపాల ఎద్దులకొండ్రాయుడు పేర్కొన్నారు. గురువారం ఆయన కుమారుడు కొండ్రాయుడు రెండో వర్ధంతి సందర్భంగా స్థానిక పాత గండి రోడ్డులోని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. అనంతరం స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. నేటి సమాజంలో అనాథ వృద్ధులను ఆదరించాలని కోరారు.

జగన్మాత.. కరుణించమ్మా

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో గురువారం శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీగాయంత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీమోహినీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. శ్రీవేంకటరమణుడి ఆలయంలో శ్రీవారు శ్రీరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పాతూరులో అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొండాపురంలో..

కొండాపురం : దత్తాపురం గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో కాత్యాయనిదేవి అంకారంలో దర్శనమిచ్చింది. ఆలయంలో పూజలు నిర్వహించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో శ్రీ బాలాత్రిపురసుందరీదేవి అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వీరపునాయునిపల్లెలో

వీరపునాయునిపల్లె : సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి లలితా పరమేశ్వరీదేవిగా, తలపనూరు గంగమ్మ తల్లి కీర్తిపల్లె నల్లనమ్మ గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా గడ్డంవారిల్లె రాజరాజేశ్వరీదేవి, అనిమెల బోగాదమ్మ కాత్యాయనిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

కమలాపురంలో..

కమలాపురం : స్థానిక అమ్మవారిశాలలో గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. అలాగే ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామి వ్రతం, నవ ధాన్యం, పూలు, పసుపు, కుంకుమలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. రాత్రి లక్కిడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కాగా గర్భగుడిలోని అమ్మవారి మూల విరాట్‌ను కరెన్సీ నోట్ల మాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పాలతల క్షేత్రంలో కాత్యాయనిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శినమించారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, పూజలు చేశారు.

ఎర్రగుంట్లలో

ఎర్రగుంట్ల : పట్టణంలోని శ్రీమత్ కన్యకాపరమేశ్వరిదేవి అన్నపూర్ణాదేవిగా, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి దేవాలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో, ఆర్టీపీపీలోని శ్రీ చౌడేశ్వరిదేవి అలంకరణలో శ్రీగాయత్రిదేవి అలంకరణలో, నడివూరులో అంకమ్మతల్లి దేవాలయంలో వనవిహారణిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శినించారు.

వల్లూరులో..

వల్లూరు : దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో అమ్మవారు శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వల్లూరులోని శ్రీవాసవీ ఆర్య వైశ్య కళ్యాణ భవనంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి రాత్రి భరత మాత అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.



పులివెందుల : శ్రీగాయత్రీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



కమలాపురం : గజలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరీ దేవీ



కొండాపురం : దత్తాపురంలో దర్శనమిచ్చిన కాత్యాయనీదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి



పెండ్లిమర్రి : పాలతలలో కాత్యాయనిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారు



ఎర్రగుంట్ల : శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



జమ్మలమడుగు : కన్యతీర్థంలో అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు



సింహాద్రిపురం : కాత్యాయిని అలంకారంలో అమ్మవారు



వీఎన్‌పల్లె : సంగమేశ్వరాలయంలో లలితా పరమేశ్వరీదేవి అలంకారంలో పార్వతీదేవి



వల్లూరు : దుగ్గాయపల్లెలో కాత్యాయనీదేవి అలంకారం చౌడేశ్వరీ మాత

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ



వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అమ్మవారిశాలలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మాత వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళామండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువును సందర్శించారు. అంతకుముందు అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు కొత్త రవికుమార్, శ్రీనివాసులు, మహేంద్రబాబు, సుబ్రమణ్యం, రమణయ్య, సాయిబాబా, నాగభూషణం, రాజశేఖర్‌గుప్తా, మహిళా మండలి సభ్యులు సుబ్బరత్నమ్మ, సుమలత, సునంద పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రాణితోపు ఆవరణలో పరిసరాలను చీపురుతో ఊడ్చుతున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

పులివెందుల టౌన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ×ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్× కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటే అది మనందరిని కాపాడుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్థానిక రాణీతోపు నగరవణం వద్ద మున్సిపల్ కమిషనర్ రాముడుతో కలసి మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం స్వచ్ఛత ర్యాలీ, శ్రమదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



శాంతమ్మను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : అమ్మవారిశాల వీధిలోని సీనియర్ పురోహితులు గోపీస్వామి భార్య శాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీ వారి స్వగృహానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. శాంతమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వరి పంటలో తెగుళ్లను నిర్మూలిద్దాం

చింతకొమ్మదిన్నె : మండలంలోని జమాల్‌పల్లెలో వరి పంటపై గురువారం ఫీల్డ్ విజిట్ కార్యక్రమాన్ని కడప ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కృష్ణప్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి పంటలు వృద్ధి దశలో ఉన్న పొలాల్లో కాండం కుళ్ళు (స్టెమ్ రాట్) వ్యాధి లక్షణాలు కనిపించాయని, ఇది పంట ఆరోగ్యానికి, దిగుబడికి ముప్పు కలిగిస్తుందిని రైతులకు వివరించారు. కాండం కుళ్ళు వ్యాధి, స్క్లెరోటియం ఒరైజే అనే ఫంగస్ వల్ల వస్తుందని, ఇది కాండంపై గోధుమ రంగు మచ్చలుగా కనిపించి పంట చాపడం, కొమ్మల సంఖ్య తగ్గడం, దిగుబడి గణనీయంగా తగ్గడానికి దారితీస్తుందన్నారు. ఈ వ్యాధి తేమ ఎక్కువగా ఉండే సమయంలో, ముఖ్యంగా వరి పంట వృద్ధి దశలో ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు. ఆమె తన పరిశీలనలో ఆధారంగా వ్యాధిని నియంత్రించడానికి, పంట ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి తగిన మందులు, స్ప్రే చర్యలను సిఫార్సు చేశారు. అలాగే సమతుల్య ఎరువుల వాడకం, తగిన ఖాళీలను నిర్వహించడం, నీటి నిల్వను నివారించడం వంటి చర్యలను రైతులకు సూచించారు.



వరి పొలంలో రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ కృష్ణప్రియ

మురుగు నీరు.. పోయేదెలా?



బీసీ కాలనీలో ఇళ్లను చుట్టుముట్టిన మురుగు నీరు

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలం వద్దిరాల బీసీ కాలనీలో రోడ్లపైనే మురుగునీరు నిల్వ ఉంటుంది. మురుగు నీటికి పోయే దారి లేకపోవడంతో వారాల తరబడి నివాస గృహాల మధ్యలోనే రోడ్లపైనే నిల్వ ఉంటుంది. ఈ నీటిపై స్థిర నివాసం ఏర్పరచుకున్న దోమల గుంపులు విలయతాండవం చేస్తున్నాయి. ఈ కాలనీకి కూత వేటు దూరంలోనే గ్రామ సచివాలయం ఉంది. అక్కడ 10 మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కాలనీలో నివాస గృహాల మధ్యనే వారాల తరబడి మురుగు నీరు తిష్ట వేసుకున్నప్పటికి పట్టించుకునే నాథుడు లేకపోవడం విచారకరం . ఇప్పటికైన ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని రోడ్లపై మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



రోడ్డుపైనే నిల్వ ఉన్న మురికినీరు



సీసీరోడ్డుపై పారుతున్న మురికి నీరు

ఘనంగా దీన్ దయాల్ జయంతి



దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : స్థానిక బీజేపీ నేతలు వేరు వేరుగా పండిట్ దీన్ దయాల్ జయంతి వేడుకలను నిర్వహించారు. గురువారం ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం, జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు పి.సుష్మా తన నివాస గృహంలో పండిట్ దీన్ దయాల్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకాత్మ మానవత వాదం సిద్ధాంతాలను రచించి, దేశానికి ఎనలేని సేవలు చేశారని పండిట్ దీన్ దయాల్ ని కొనియాడారు. అలాగే అంత్యోదయే స్ఫూర్తిగా నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీని నివారిద్దాం

వేంపల్లె : హెచ్ఐవీని నివారిద్దాం అనే నినాదంతో ప్రచారథం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు సీహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ మంజుల తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు వేంపల్లెలో, పరిసర గ్రామీణ పల్లెల్లో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రచార రథంను మొదలు పెట్టి ప్రతి ఊరిలో ప్రతి పల్లెలో అందరికీ హెచ్ఐవీపైన అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సొసైటీ వారు ఈ ప్రచార రథంను పంపిచారన్నారు.

ప్రచార రథం యొక్క ముఖ్య ఉద్దేశం వీడియో ద్వారా ప్రజలను హెచ్ఐవీపై చైతన్య పరుస్తూ హెచ్ఐవీ గురించి ప్రతి ఒక్కరికి తెలిసేలా చేయడమే ఈ ప్రచార రథం యొక్క ముఖ్య ఉద్దేశం. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ వల్లి, డీఆర్పి లింక్ వర్కర్ స్కీం, సీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



హెచ్ఐవీపై ప్రచార రథం ద్వారా అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ఘనంగా ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం

చింతకొమ్మదిన్నె : స్థానిక ఊటుకూరు ప్రకృతినగర్‌లోని పి.రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రపంచ ఫార్మాసిస్టల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురువృద్ధుడు ఫార్మాసిస్ట్ ఉమామహేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నెల్సన్ కుమార్, కరెస్పాండెంట్ గౌతంరెడ్డి, సెక్రటరీ జయసుబ్బారెడ్డి పాల్గొన్నారు. మహేశ్వరరావు మాట్లాడుతూ చివరి రక్తపు బొట్టు వరకు తెల్ల కోటు వదిలేదు లేదని, రోగులకు సహాయపడేటందుకే ఈ జీవితం అని తెలిపారు.

పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ఎర్రగుంట్ల : చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి పీఎం స్వనిధి యోజన పథకంలోని లోక్ కళ్యాణ్ పథకం ఎంతో ఉపయోగపడుతుందని మెప్మా పీడీ కిరణ్‌కుమార్ తెలిపారు. పొదుపు సంఘాల మహిళలకు మున్సిపల్ కమిషనర్ శేషఫణి అధ్యక్షతన మార్కెట్ యార్డు అవరణలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.15 వేలు నుంచి రూ.50 వేలు వరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తారన్నారు. అర్హులైన వీధి విక్రయదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉంటే వెంటనే రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ సురేంద్ర, ఎస్‌బీఐ మేనేజర్ రామరావు, ఏపీజీబీ మేనేజర్ అబ్దుల్ హుస్సేన్, డీసీసీ బ్యాంక్ మేనేజర్ షకీర బాను, మెప్మా టీఎంసీ నాగేంద్ర, వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, టీపీఓ రమణారెడ్డి, సీఓలు హరిత, వసంతరెడ్డిలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌లో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషఫణి పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యంలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని ఆయన అన్నారు. అనంతరం పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతి పురస్కరించుకుని ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాథ్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛతను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మెప్మా, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.